క్లుప్తంగా

11న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం సమావేశం



పార్టీ ఎస్సీ విభాగం జిల్లా సమావేశానికి ఎంపీ గురుమూర్తిని ఆహ్వానిస్తున్న తలారి రాజేంద్ర, మల్లారపు వాసు

తిరుపతి మంగళం : తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సమావేశానికి విచ్చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి మల్లారపు వాసులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పాల్గొంటారని తెలిపారు.

జీవన నైపుణ్యాలపై సదస్సు



సదస్సుకు హాజరైన అధ్యాపకులతో వర్సిటీ వీసీ ఆచార్య ఉమ

తిరుపతి రూరల్: శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు జీవన నైపుణ్యాలపై సదస్సును నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి మూడు రోజులపాటు జరిగే సదస్సును వీసీ ఉమ ప్రారంభించారు. ఈ సదస్సులో వర్సిటీలో పనిచేసే బోధనా సిబ్బంది 38 మంది శిక్షణ పొందనున్నారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య వి.ఉమ మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకోవడంలో వెనకబడి ఉన్నారన్నారు. అనంతరం ప్రొఫెసర్ ఉష మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ జీవన నైపుణ్యాలపై శిక్షణ అందించడానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, పీఎం ఉష కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ వాణి సహాయ సహకారాలు అందించగా ప్రొఫెసర్ జాన్ సుష్మా, డాక్టర్ భార్గవి ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వ్యవహరించారు.


పేదల ఆరోగ్య రక్షణకు వైద్యశిబిరం



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య బృందం

తిరుపతి కల్చరల్: సాధన మహిళా అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యూ ఇందిరానగర్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రావూరు ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, పేదలు నివశించే ఎస్టీవీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం ద్వారా పేదల ఆరోగ్య రక్షణకు తోడ్పడడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా వైద్యులు శిబిరానికి వచ్చిన వారికి ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సరళకుమారి, ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, కోశాధికారి షాలిని, ప్రభు, ప్రజలు పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసురాలు సుమతికి సత్కారం



ప్రముఖ మృదంగ విద్వాంసురాలు సుమతి రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో విజయవాడకు చెందిన ప్రపంచ తొలి మృదంగ మహిళా విద్వాంసురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఘంటసాల మ్యూజిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ దండమూడి సుమతిని జ్ఞాపిక, శాలువలతో ఘనంగా సత్కరించారు. పాస్ మనోవికాస్ కేంద్రంలో ఆదివారం గురుజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మృదంగ విద్వాంసులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం పాస్ మనోవికాస్ కేంద్రం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా మృదంగ విద్వాంసురాలు సుమతి రామ్మోహనరావు ప్రదర్శించిన మృదంగనాద వినోదం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాస్ మనోవికాస్ సంస్థ ప్రతినిధి పీఎస్‌వీ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతి పల్లెవెలుగు బస్టాండ్‌లో బస్సులు లేకపోవడంతో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు(ఫైల్)



అప్పలాయగుంట బస్సు ఎక్కడానికి పోటీపడుతున్న ప్రయాణికులు (ఫైల్)

ఏం ఉండలేరా.. ? ఫ్రీగానే కదా వెళ్లేది..!

ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి–తిరుమల నేపథ్యంతో పాటు జిల్లాకేంద్రం పరిధిలోని బస్టాండ్ కావడంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అయితే ప్రయాణికుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించల్సిన కొందరు కంట్రోలర్స్ విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి. దీంతో నిత్యం బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు బస్సులు ఎప్పుడు వస్తాయని ప్రయాణికులు ఎవరైనా అధికారులను అడిగితే ఒంటికాలితో లేచి సమాధానం ఇస్తున్నారు. ఫ్రీగానే కదా వెళ్లేది ఉండలేరా అని ఫైర్ అవుతున్నారు.

- బస్సులెప్పుడు వస్తాయని అడిగితే ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారుల వింత వైఖరి
- పల్లెవెలుగు సర్వీసులన్నీ మహిళలకు ఉచితమే కదా అని వ్యంగ సమాధానాలు
- ఏ సర్వీస్ ఏ రూట్‌లో ఉందో అర్థం కాదు – ట్రాఫిక్ నియంత్రణలోనూ అధికారుల బాధ్యతారాహిత్యం
- మరోవైపు శ్రీహరి బస్టాండ్ కూల్చివేత పనులు మరూ – పట్టించుకునే నాథుడు కరువు

తిరుపతి అర్బన్: దేశం నలుమూలల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులతో తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్లు అనునిత్యం రద్దీగా ఉంటాయి. అందులో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్లు ఉన్నాయి. ప్రధానంగా ఆదివారం అయితే చాలు బస్టాండ్‌లో ట్రాఫిక్ ఏర్పడుతోంది. కొందరు డ్రైవర్లు బస్సులను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడం వల్లే ఈ సమస్య తీవ్రతరం అవుతోంది. ఈ క్రమంలో నిత్యం బస్టాండ్‌పై నిఘా పెట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఉచిత బస్సు స్కీమ్ వచ్చిన తర్వాత అధికారుల తీరు మారిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

దయనీయ పరిస్థితి..

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో ఉన్న పల్లెవెలుగు బస్టాండ్ పరిస్థితి దయనీయంగా మారింది. కేవలం ఈ బస్టాండ్‌లో పల్లెవెలుగు సర్వీసులు మాత్రమే వస్తుంటాయి. ప్రధానంగా 30 గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఈ బస్టాండ్ ఆధారంగా తమ సొంత ఊర్లకు వెళ్తుంటారు. నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే గంటకు ఓ పల్లెవెలుగు బస్సు బస్టాండ్‌కు వస్తుంది. దీంతో గ్రామీణ వాసులు గంటల కొద్దీ బస్టాండ్‌లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఆర్టీసీ ఉద్యోగులను గంట నుంచి ఉన్న మా ఊరు బస్సు రాలేదు ఏంటి సార్ అని ప్రశ్నిస్తే ? వస్తుంది లేమ్మా ? ఉచిత ప్రయాణమే కదా ? డబ్బులు ఏమైనా చెల్లిస్తున్నారా ? మమ్మల్ని అడగడానికి అని వ్యంగంగా సమాధానం ఇస్తుండడంతో ఆశ్చర్యపోవడం ప్రయాణికుల వంతు అవుతోంది. ఉచిత బస్సులంటే ఇలా మాట్లాడతారా ? అని మహిళలు చర్చించుకుంటున్నారు.

ఏ సర్వీస్ ఏ రూట్‌లో నడుస్తుందో ?

ముందే పల్లెవెలుగు సర్వీసుల కొరత తెలిసిందే. దాంతో గతంలో పలు మార్గాల్లో సర్వీసులు లేకుండా ఉండేవి. అయితే ఉచిత బస్సు నేపథ్యంలో అన్ని మార్గాల్లో కనీసం ఒకటి లేదా రెండు సర్వీసులైనా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉండడంలో ఉన్న సర్వీసులనే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో ఏ రూట్‌లో ఏ బస్సు నడుస్తోందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మహిళలు తమ ఊరుకు వెళ్లే బస్సు కోసం గంటల కొద్దీ వేచి ఉండలేక తిప్పలు పడుతున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం రద్దీని బట్టి బస్సులను క్రమబద్ధీకరణ చేయాల్సి ఉన్నా.. అటువైపు కన్నెతి చూసే నాథుడే కరువయ్యాడు. పల్లెవెలుగు అంటే అన్ని ఉచిత బస్సులే కదా ఎవరూ అడుగుతారనే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. మరోవైపు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి బస్టాండ్ ఐదు దశాబ్దాల క్రితం నిర్మించడంతో స్లాబ్ దెబ్బతిని పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ తరుణంలో మూడు దశల్లో తొలగించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. మొదటి దశలో ఐదు, రెండో దశలో 8, మూడో దశలో 6 ప్లాట్‌ఫాంలను తొలగించనున్నారు. మొదటి దశలో 5 ప్లాట్‌ఫాంల తొలగింపు పనులు తుది దశకు చేరుకున్నాయి. వెంటనే రూ.45 లక్షలతో ఐదు ప్లాట్‌ఫాంల పరిధిలో తాత్కాలిక రేకుల షెడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ తొలగింపు పనులతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.



కొనసాగుతున్న శ్రీహరి బస్టాండ్ కూల్చివేత పనులు

పర్యవేక్షణ చేస్తాం..

పల్లెవెలుగు బస్టాండ్‌లో పర్యవేక్షణ చేస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు వేచి ఉండకుండా అన్ని మార్గాల్లో సర్వీసులను సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. పల్లెవెలుగుకు చెందిన అన్నీ సర్వీసులను సక్రమంగా తిరిగేలా ఆదేశాలు ఇస్తాం.

– భాస్కర్‌రావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి బస్టాండ్

కార్మికులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

తిరుపతి కల్చరల్: నిరంతర శ్రమజీవులైన కార్మికుల హక్కులు కల్పించి వారి అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమై వారిని దగా చేస్తున్నాయని ఐఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎల్.రత్నకుమార్ విమర్శించారు. యూత్‌హాస్టల్లో ఆదివారం తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఐఎన్‌టీయూసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పని భారం పెరగడంతో పాటు అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, ఆటో యూనియన్, మెడికల్ కళాశాలలు, మీసేవ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వేడుకగా చండీహోమం

తిరుపతి కల్చరల్: పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం చండీ హోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమ మండపంలో అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం 8.45 గంటలకు ఆరంభమైన చండీ హోమం 11.30 గంటలకు పూర్ణాహుతితో పరిసమాప్తమైంది.

గంగమ్మ ఆలయానికి భూమి కొనుగోలు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భూమిని దాతల సాయంతో కొనుగోలు చేశారు. అమ్మవారి ఆలయంలోని వినాయకుడి గుడిని ఆనుకుని ఉన్న ముప్పై ఒకటిన్నర అంకణాల ప్రైవేటు భూమిని రూ.50 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ పత్రాలను గంగమ్మ పాదాల వద్ద ఉంచి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఈఓ జయకుమార్ పూజలు నిర్వహించారు. ఈ భూమికి సంబంధించి అడ్వాన్సుగా ప్రస్తుతం రూ.25 లక్షలు ఇచ్చారు. రాయలసీమ విద్యాసంస్థల అధినేత లావణ్య ఆనంద్‌రెడ్డి, కవిత, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఒక్కొక్కరు రూ.5 లక్షలు చొప్పున అందించారు. మిగిలిన మొత్తం సొమ్మును దాతల సాయంతో త్వరలోనే చెల్లిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అలాగే మరో 30 అంకణాల నివాస స్థలాన్ని ఆలయానికి ఇచ్చి సహకరించాలని స్థల యజమానులను ఆయన కోరారు.

సీఐటీయూ సభలకు తరలిరండి

చంద్రగిరి: కార్మిక వర్గ సమస్యలను పరిష్కార వేదికగా నిలుస్తున్న సీఐటీయూ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. పుత్తూరు పట్టణంలో అక్టోబర్ 13, 14వ తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగ్‌రావు హాజరు కానున్నారన్నారు. ఇందుకు సంబంధించి తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఆదివారం తిరుపతి రూరల్ పార్టీ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న బాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకొచ్చారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని, 2014 నుంచి 2025 వరకు వేతనాలు పెరిగిన దాఖలాలు లేవని తెలిపారు. 8 గంటల పని విధానం నుండి 12 గంటల పని విధానం కోసం ప్రభుత్వం తీర్మానం చేసిందని, కార్మికులు ఎనిమిది గంటల పని విధానం కోసం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న దాన్ని ప్రభుత్వాలు తుంగలో తొక్కి దీనిని దీన్ని మార్పు చేయడం తగదన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని, చాలీచాలని వేతనాలతో కష్టజీవులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల గొంతు కోసే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ వర్కర్స్‌కు మినిమం టైమ్స్ వర్తింపజేయాలని అనేక సందర్భాలుగా ఆందోళన నిర్వహించినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే ఎంటీఎస్ విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు రాము, ప్రభాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కిరణ్, గురు తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నోటీస్ బోర్డు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ఎస్వీయూనివర్సిటీలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా
- ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు సదస్సు
- వేదాంతపురం దోబీఘాట్ ఆక్రమణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన.

స్థానిక ఆలయాల మూత



శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మూసివేత

తిరుపతి అన్నమయ్యసర్కిల్/తిరుపతి కల్చరల్/చంద్రగిరి : చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ స్థానిక ఆలయాలు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం, కార్వేటినగరం, ఒంటిమిట్ట, అమరావతి శ్రీఎస్వీ ఆలయం తదితర ఆలయాల తలుపులు మూసివేశారు. ఆదివారం రాత్రి 9.50 గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున 1.31 గంటల వరకు చంద్రగ్రహణం ఉండడంతో గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. అలాగే పేరూరు బండపై వెలసిన శ్రీవకుళామాత ఆలయాన్ని కూడా అధికారులు మూసి వేశారు. చంద్ర గ్రహణం పూర్తయిన తరువాత సోమవారం తిరిగి ఆలయం తలుపులు తెరవనున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని టీటీఈ కంపెనీ సీఎస్ఓ సూర్యరెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, యానాది సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటయ్య డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీటీఈలో సెక్యూరిటీగా పనిచేస్తున్న భాగ్యానాయక్‌ను ఆదివారం వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యనాయక్ సెక్యూరిటీగా ఈకంపెనీలో పనిచేస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం సూర్యరెడ్డి భాగ్యనాయక్‌ను లాఠీతో కొట్టిగాయపరిచి, కులం పేరుతో దూషించారని చెప్పారు. రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఏర్పేడు పోలీస్ అధికారులు కనీసం సూర్యరెడ్డిపై కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. కేసు నమోదు చేయకుంటే రేపటి నుంచి దళిత, యానాది సంఘాల ఆధ్వర్యంలో అట్రాసిటీ కేసు నమోదు చేసే వరకు ఆందోళనలు సాగిస్తామని అన్నారు. పట్టణ కార్యదర్శి రొద్ద గోపి, ప్రజాసంఘాల నేతలు తమీన్, రాఘవులు, శేఖర్, చాన్‌బాషా పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరం




గురువు మునిరాజాను సన్మానిస్తున్న శిష్యులు

తిరుపతి సిటీ: ఆత్మరక్షణ విద్యల్లో ఒకటైన కర్రసామును నేటి తరానికి ఉచితంగా నేర్పిస్తున్న గురువు మునిరాజా అభినందనీయులని కర్రసాము నేర్చుకుంటున్న పలువురు కొనియాడారు. వినాయక సాగర్‌లో ఉచితంగా కర్రసాము నేర్పిస్తున్న గురువు మునిరాజాను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కర్రసాము నేర్చుకుంటున్న వారు మాట్లాడుతూ ప్రాచీన కళ అయిన కర్రసాము విద్యను నేటి తరానికి నేర్పిస్తున్న మునిరాజా అభినందనీయులు అన్నారు. మహిళలకు కూడా ఆయన కర్రసాము గొప్పతనం గురించి వివరించి నేర్పించడం చాలా మంచి పరిణామమన్నారు. గురువు మునిరాజా మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి గర్భాలయంలో ఎన్నో ఏళ్లు సేవ చేశానన్నారు. పదవీ విరమణ తరువాత తాను 50 ఏళ్ల కిందట నేర్చుకున్న కర్రసాము విద్యను ఇప్పుడు అందరికీ ఉచితంగా నేర్పుతున్నానని తెలిపారు. అంతరించిన పోతున్న ప్రాచీన విద్యను ఈ తరం వారికి నేర్పిస్తుండడం తనకు ఎంతో సంతృప్తి ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారు ఆయనకు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న మణి, భారతి, బాలాజీ, నరసింహులు, అంకిరెడ్డి, సాంబయ్య, శుక్లా తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల విలువైన కాలువ భూమి ఆక్రమణ



సర్వే నంబర్ 214లో చదును చేస్తున్న కాలువ భూమి



ఆక్రమిత భూమిలో నిర్మాణాలు

తిరుపతి రూరల్: టీడీపీ నేతలు బరితెగించి కోట్లు విలువైన భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం లెక్క దాఖలా సర్వే నంబర్ 214లో ఉన్న 0.55 సెంట్లు భూమిని టీడీపీ నేతలు యథేచ్ఛగా కబ్జా చేశారు. వేదాంతపురానికి చెందిన పచ్చ నేతలు కోట్లు విలువైన కాలువ భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించు కోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

దోబీఘాట్ స్థలం ఆక్రమణ

ప్రస్తుతం ఆక్రమణకు గురైన కాలువ భూమిని గతంలో దోబీఘాట్‌కు కేటాయించారని శ్రీవేంకటేశ్వర రజక సంఘం నేతలు చెబుతున్నారు. టీడీపీకి చెందిన వేదాంతపురం మాజీ సర్పంచ్ తదితరులు కోట్లు విలువైన భూమిని గత మూడు రోజులుగా చదును చేసి అక్రమ కట్టడాలు కడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా కానీ అక్కడ జరిగే నిర్మాణ పనులను నిలుపుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పరిస్థితి చూస్తుంటే రెవెన్యూ అధికారులతో ఆక్రమిస్తున్న వారు కుమ్మక్కై, ఇల్లు నిర్మాణాలు చేస్తున్నట్టు అర్థమవుతోందని ఆరోపించారు. కోట్లు విలువైన భూములను కాపాడడంపై జిల్లా కలెక్టర్, తిరుపతి ఆర్డీఓ స్పందించి రజకుల స్థలంలో నిర్మించిన షెడ్లను తొలగించాలని, రజకుల స్థలాన్ని రజకులకే కేటాయించాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వైఫల్యం



మాట్లాడుతున్న టీటీడీ స్టాఫ్ ఫండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ పర్మినెంట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం వైఫల్యం ప్రదర్శిస్తోందని టీటీడీ స్టాఫ్ ఫండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్‌కు చెందిన పలువురు నేతలు ఆరోపించారు. ఆదివారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో 40వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత టీటీడీలో సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అధికారులు, పాలకమండలి మధ్య సమన్వయ లోపం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నన్నారు. గత నాలుగున్నరేళ్లుగా వందల మంది పదవీ విరమణ పొందుతున్నా.. తమకు పదోన్నతులు లేవన్నారు. ఖాళీల భర్తీకి యాజమాన్యం చొరవ చూపడం లేదని విమర్శించారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. సొసైటీ, కార్పొరేషన్, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. మినిమం టైమ్ స్కేలు ఇవ్వాలని, తక్షణం రిక్రూట్‌మెంట్ చేపట్టాలనే పలు తీర్మానాలను ఉద్యోగులు సభలో ఆమోదించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కోశాధికారి కేఎస్ఎన్ ప్రసాదరావు, టీటీడీ స్టాఫ్ ఫండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు వెంకటేశం, కాటా గుణశేఖర్, మల్లారపు నాగార్జున, వెంకటరమణ, రాము, రత్న ప్రభాకర్ పూజారి, వెంకటరమణ, ఏ.నరేష్, టి.శ్రీనివాసులు, వేణుగోపాల్, నాగారత్నం, యుగేందర్ రావు, హనుమంత్ రెడ్డి, పట్నం దయాకర్, ధారా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రివిలేజ్ కార్డు ఆవిష్కరణ



ప్రివిలేజ్ కార్డును ఆవిష్కరిస్తున్న అతిథులు, ఆస్పత్రి యాజమాన్యం

తిరుపతి తుడా: రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురుదేవో భవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి డీఈఓ కేవీఎన్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాయలసీయ జోన్ అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ రెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఆరోగ్య సంరక్షణ తమ బాధ్యతగా పరిగణిస్తూ వారి కోసం ప్రివిలేజ్ కార్డును ప్రవేశపట్టామని ఆస్పత్రి యాజమాన్యం చెప్పారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ సునంద, సీఓఓ డాక్టర్ శ్రీధర్ ముని, వైద్యులు పాల్గొన్నారు.